CPI(M)

CPI

# గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు - 2020

# సిపిఐ(ఎం), సిపిఐ పార్టీల

# ఉమ్మడి మ్యానిఫెస్టో

ప్రియమైన ప్రజలారా!

నాలుగు శతాబ్దాల పైబడిన చరిత్ర కలిగిన హైదరాబాద్ నగరం సమశీతల వాతావరణం,విభిన్న సంస్కృతుల సమ్మేళనంతో కూడిన అభివృద్ధి పథంలో సాగుతున్నది. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో, ఉపాధి కల్పనలో ఈ నగరమే అత్యంత కీలకం. నగరం వేగంగా విస్తరిస్తున్నప్పటికీ దానికి తగినట్టుగా మౌలిక వసతులు అభివృద్ధి చేయడంలో పాలక పక్షాలన్నీ విఫలమయ్యాయి. ప్రతి ఏటా కురిసే వర్షాలు నగర అభివృద్ధిలో డొల్లతనాన్ని బట్టబయలు చేస్తున్నాయి. 74వ రాజ్యాంగ సవరణ ప్రకారం స్థానిక సంస్థలకు నిధుల బదలాయింపు పట్ల పాలక పార్టీలు నిర్లక్ష్యం చేశాయి.

భూకబ్జాలు, అక్రమనిర్మాణాలు, అవినీతి, నేర రాజకీయాలు పెచ్చరిల్లి పోతున్నాయి. ఇటీవలి కాలంలో మతతత్వ శక్తులు ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకు కుటిలప్రయత్నాలు ప్రారంభించాయి. ఈ శక్తుల ఆగడాలు గత కాలపు మత మారణకాండ, కర్ఫ్యూ లాంటి గాయాలను గుర్తు చేస్తున్నాయి. పవిత్రమైన పండుగలను బల ప్రదర్శనకు వేదికగా, విద్వేషాల కేంద్రాలుగా మతతత్వ శక్తులు మారుస్తున్నాయి. ప్రజల అప్రమత్తతో మతతత్వ శక్తుల ఆగడాలు నిలువరించబడినప్పటికీ మారిన దేశ పరిస్థితుల్లో తిరిగి ఈ శక్తులు పెట్రేగుతున్నాయి. రాజకీయ లబ్ది కోసం సామరస్య వాతావరణాన్ని దెబ్బతీస్తూ నగర అభివృద్ధికి తీవ్ర విఘాతం కలిగించనున్నాయి.

దేశ ,రాష్ట్ర రాజకీయాల్లో వామపక్షాలు ప్రత్యామ్నాయ విధానాల కోసం పోరాడుతున్నాయి. కేరళ వామపక్ష ప్రభుత్వం ప్రత్యామ్నాయ అభివృద్ధికి గొప్ప మోడల్ గా నిలిచింది. ఇటీవలి బీహార్ ఎన్నికల్లో ప్రజలు వామపక్షాలకు గొప్ప విజయాన్ని అందించారు.

నగరంలో సిపిఐ-సిపిఎం పార్టీలు పేదలు, కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించాయి, నగరాభివృద్ధికి ప్రత్యామ్నాయ విధానాలను ప్రభుత్వం ముందుంచాయి. ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాడుతున్న సిపిఎం, సిపిఐ పార్టీలు జిహెచ్ఎంసి ఎన్నికల్లో ఉమ్మడిగా పోటీ చేస్తున్నాయి. అవినీతి మచ్చలేని, ప్రజల పక్షాన నిలబడే వామపక్ష అభ్యర్థులను ఈ ఎన్నికల్లో గెలిపించాలని, ధనస్వామ్య, మతతత్వ రాజకీయాలను ఓడించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

## మ్యానిఫెస్టో

- నగరంలో మౌలిక వసతులు, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కోసం కృషి చేస్తాం. మురికివాడలు, కార్మిక వాడలు, శివారు ప్రాంతాలు, పాతనగరం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టితో పనిచేస్తాం.
- నగరాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి రాజ్యాంగబద్ధంగా జరగాల్సిన నిధుల బదలాయింపు కోసం కృషి చేస్తాం.
- ఇల్లులేని ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు దక్కేలా కృషి చేస్తాం. డబుల్ బెడ్ రూం ఇళ్ళు పూర్తి చేయడానికి మరియు అవి అర్హులకే అందేలా ప్రభుత్వంపై పోరాడుతాం.
- చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణల నుండి కాపాడుతాం. డ్రైనేజీ, సీవరేజ్ వ్యవస్థ అభివృద్ధికోసం నిధుల సాధనకు పోరాడుతాం.
- ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న పేదల ఇళ్ళస్థలాలకు పట్టాలు, ఉచితంగా రిజిస్ట్రేషన్ కోసం కృషి చేస్తాం.
- ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి వ్యక్తిగత వాహనాలు తగ్గి ప్రజా రవాణా పెరిగేవిధానం కావాలి. నగరంలో ఆర్టీసీ బస్సుల సంఖ్య రెట్టింపు కోసం, ఒప్పందానికనుగుణంగా మెట్రోరైల్ ఛార్జీలు తగ్గించేలా, ఎంఎంటీఎస్ రెండో ఫేజ్ వెంటనే ప్రారంభించేలా పోరాటం సాగిస్తాం.

- పాతనగరంలో మెట్రోరైల్ పనులు వెంటనే ప్రారంభించేలా ఐక్య ఉద్యమాన్ని కొనసాగిస్తాం. గ్రేటర్ పరిధిలో ఇతర ప్రాంతాల విస్తరణకు ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తాం.
- ప్రధాన రహదారులన్నింటిలో ఫుట్‌పాత్‌ల నిర్మాణం జరగాలి. ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగించాలి. వీధి వ్యాపారులకు ప్రత్యేక స్థలాలు కేటాయించాలి. వారికి రక్షణ కల్పించాలి. నివాసయోగ్యమైన హైదరాబాద్‌కోసం ఐక్యంగా పోరాడుతాం.
- గంగా జమున తెహజీబ్‌గా పేరుగాంచి, భిన్న సంస్కృతుల సమ్మేళనంతో అభివృద్ధి చెందుతున్న మన నగరంలో విద్వేష రాజకీయాలతో ప్రజల ఐక్యతను దెబ్బతీసే శక్తుల పట్ల అప్రమత్తంగా వ్యవహరిస్తాం.
- నగరంలో మౌలిక వసతుల కల్పనలో కీలకంగా వ్యవహరించే ప్రభుత్వ సంస్థల మధ్య సమన్వయం జరపాలి. పర్యావరణవేత్తలు, వివిధ రంగాల నిపుణులు, సిటిజెన్స్ ఫోరమ్స్, బస్తీ, కాలనీ వెల్ఫేర్ సంఘాలను కలుపుకుని ముందుకు సాగుతాం.
- మూసి నదిని మురుగు కాలుష్యం నుండి, ఆక్రమణల నుండి కాపాడుకోవాలి. హుస్సేన్‌సాగర్, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ లాంటి ప్రధాన జలాశయాలను రక్షించుకోవాలి.
- గ్రామీణ ఉపాధి హామీ పథకం మాదిరిగా నగరంలో 200 రోజుల ఉపాధి కోసం పోరాడుతాం.
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తాం.
- అర్బన్ హెల్త్ సెంటర్స్, బస్తీ దవాఖానాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తాం.
- మహిళల రక్షణకు షీ టీమ్స్, భరోసా కేంద్రాల పెంపుదల కోసం కృషి చేస్తాం. మహిళా కమిషన్ ఏర్పాటు కోసం, పొదుపు గ్రూపులకు వడ్డీలేని రుణాలు సాధనకు పోరాడతాం.
- రాష్ట్ర ప్రభుత్వం తొలగించిన 26 బిసి కులాలను తిరిగి జాబితాలో చేర్చుటకు పాటుపడతాం.
- పార్కులు, బహిరంగ స్థలాలు, అన్ని డివిజన్‌లలో అభివృద్ధి, ఆక్రమణల నుండి కాపాడటానికి కృషి.
- జిహెచ్‌ఎంసీ, నగర పాలనా వ్యవస్థల్లో అవినీతి నిర్మూలనకు, పారదర్శక పాలనకు విజిల్ బ్లోయర్స్‌గా పనిచేస్తాం.
- కేరళ ప్రభుత్వ మాదిరిగా అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డు, 14 రకాల నిత్యావసర సరుకుల పంపిణీకి కృషిచేస్తాం.
- అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాల అమలు, సమాన పనికి సమాన వేతనం, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల పర్మినెంట్ కోసం పోరాడుతాం.
- వాతావరణ కాలుష్యం నుండి నగరాన్ని రక్షించుకునేందుకు పర్యావరణవేత్తలు, మేధావులు, స్వచ్ఛందసంస్థలు, ప్రజాసంఘాలతో మానిటరింగ్ చేస్తాం.
- రక్షిత మంచినీరు పొందడం ప్రజల హక్కు. ఢిల్లీలో మాదిరిగా నగరంలోని పేదలందరికీ ఉచితంగా మంచినీటి సరఫరా కోసం కృషి చేస్తాం.
- ఎల్‌ఆర్‌ఎస్, బిఆర్‌ఎస్, యూజర్ చార్జీలు తదితర భారాలకు వ్యతిరేకంగా పోరాడుతాం. నగరంలో సంపన్నులు, సామాన్యుల మధ్య వివక్షలేని సమానమైన సేవలు అందేలా కృషి చేస్తాం.

పై లక్ష్యంతో సిపిఐ మరియు సిపిఐ(ఎం) పార్టీలు ఉమ్మడిగా పోటీ చేస్తున్నాం.

మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాల్సిందిగా కోరుతున్నాము.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)    భారత కమ్యూనిస్టు పార్టీ